సాక్షి
అన్నమయ్య జిల్లా

మంగళవారం । 18 । మార్చి । 2025



భక్తి పారవశ్యం.. ప్రేమ వాత్సల్యం

భక్తి పారవశ్యానికి ప్రతీక అయిన రంజాన్ మాసం ప్రేమ.. వాత్సల్యాన్ని పంచుతోంది. జకాత్ ద్వారా పేదలను అక్కున చేర్చుకునే శుభాల వసంతం. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ॥ (సా॥)	సహర్ బుధ॥ (ఉ॥)
రాయచోటి :	6.30	5.01
రాజంపేట :	6.28	5.09
పీలేరు :	6.30	4.58
మదనపల్లె :	6.30	5.00

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.120
రెండోరకం	రూ.60	రూ.90



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 118 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	580	685
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 290.640 కిలోలు

పరిష్కారం.. పరిహాసం

- కలెక్టరేట్ అర్జీలకు లభించని మోక్షం
- ఎన్నాళ్ల నుంచో తిరుగుతున్నా ఫలితం శూన్యం
- వ్యయ ప్రయాసాల కోర్చి జిల్లా కేంద్రానికి పరుగులు
- మరోవైపు బరి తెగిస్తున్న కూటమి నేతలు
- భరించలేక కలెక్టరేట్‌కు క్యూకడుతున్న బాధితులు



రాయచోటిలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బాధితులు

సాక్షి రాయచోటి : ఎక్కడ చూసినా .. ఎప్పుడు చూసినా ఏమున్నది గర్వకారమన్నట్లు పరిస్థితి తయారయింది ... ఏదో చేస్తారని.. ఏమేమో జరిగిపోతాయని ఎంతో ఆశతో.. కష్టాలు పడుతూ .. కన్నీళ్లు దిగమింగుతూ కలెక్టరేట్ వస్తున్నా సమస్యలు పోవడం లేదు... అధికారం అండగా.. ఆగడాలు మెండుగా.. జిల్లాలో కొనసాగుతున్నాయి. భూ ఆక్రమణలు, దందాలు, కబ్జాలు, దౌర్జన్యాలకు కొదవ లేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎక్కడ చూసినా నేతలు బరి తెగిస్తున్నారు. ఆర్థికంగా బలోపేతం కావడం కోసం కొందరు అక్రమ మార్గాన్ని ఎంచుకుంటే.. మరికొందరు దౌర్జన్య మార్గాలతో ముందుకు సాగుతున్నారు. ఆదాయ వనరుగా ఉన్న ప్రతి పనిని సద్వినియోగం చేసుకునేందుకు వక్ర మార్గాలను ఎంచుకుంటున్నారు. ఇప్పటికే ఇసుక, మద్యం, మట్టి, రాళ్లు, భూములు ఇలా అవకాశం ఉన్న ప్రతి దానిపై కన్నేస్తున్నారు. కూటమిలో నేతలు కొందరు ఇలా అక్రమ మార్గాలవైపు వెళతున్నారు .. ఎన్నో వెయ్య ప్రయాసలకు ఓర్చి ఇంత దూరం వచ్చిన బాధితులకు న్యాయం మాత్రం కొండంత దూరంలో కనిపిస్తోంది.. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ నిర్వహించే అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ వచ్చి గోడు వెళ్లబోసుకునేందుకు బారులు తీరుతున్నారు.

కొండంత ఆశతో..

అన్నమయ్య జిల్లాలోని అటు తంబళ్లపల్లె, ఇటు రైల్వేకోడూరు, మదనపల్లె, రాజంపేట ఇలా చెబుతూపోతే దూర ప్రాంతాల నుంచి ఎన్నో ఆశలతో కలెక్టరేట్‌కు కదులుతున్నారు. కానీ పెన్షన్లు, ఇతరత్రా చిన్నపాటి సమస్యలకు కూడా ఒక్కోసారి పరిష్కారం గగనంగా మారుతోంది. ఎక్కువగా రెవెన్యూకు సంబంధించి ఆన్‌లైన్, అధికార పార్టీ నేతల కబంధ హస్తాల్లో చిక్కుకున్న స్థలాలను విడిపించాలని, ఇతరత్రా దాడులు, వాటిపై ఫిర్యాదులు వస్తున్నాయి. ఇటీవల మదనపల్లెలో మాజీ ఎమ్మెల్యే 70 మందికి సంబంధించిన స్థలాన్ని రికార్డుల్లో మార్పించుకోవడం, అలాగే కురబలకోట మండలం అంగళ్ల వద్ద మరో 60 మందికి సంబంధించిన స్థలాన్ని కూటమి సర్కారులోని కొందరు కాజేస్తున్నారని బాధితులు కలెక్టరేట్‌కు వచ్చారు. ఇలా ఏదో ఒకచోట అధికార పార్టీ చేస్తున్న ఆగడాలపై జిల్లా కలెక్టరేట్‌కు ఫిర్యాదుల పరంపర కొనసాగుతోంది. అయితే కూటమిలోని నాయకులకు సంబంధించిన భూ వివాదాలు కావడంతో అధికారులు కూడా పట్టించుకునే పరిస్థితి లేదు. అయితే బాధితులు మాత్రం కొండంత ఆశతో కలెక్టరేట్‌కు పరుగులు తీస్తూ కనిపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 40,362 ఫిర్యాదులు రాగా, వాటిలో 35,427 పరిష్కరించారు. ఇంకా 3793 ఫిర్యాదులో పెండింగ్‌లో ఉండడం గమనార్హం.

కొన్నేళ్లుగా తిరుగుతున్నా..



అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్‌లోకి ఇలా పాకుకుంటూ వస్తున్న దివ్యాంగుడిని చూస్తే బాధేస్తుంది. మండు వేసవిలో కాళ్లు చేతులతో పాకుతూ... రోడ్డు ఎండలకు కాలుతుండడంతో అలాగే ముందుకు వచ్చి అతి కష్టం మీద కలెక్టరేట్‌లోకి వచ్చిన ఇతని పేరు ఎలిశెట్టి పార్థసారథి. ఊరు జిల్లా కేంద్రంలోని మాసాపేట. 'నా వయసు 25 సంవత్సరాలు, డిగ్రీలో బీజెడ్‌సీ పట్టా పొందాను. నేను అడిగేది నాకు పెన్షన్ ఇవ్వండి. చదువుకు తగ్గట్టు ఉద్యోగం కల్పించండి... పోయిన కొన్ని సర్టిఫికెట్లు ఇప్పించండి.. ఇలా ఒక్కసారి కాదు చాలాసార్లు వచ్చి కలెక్టర్ కార్యాలయంలో వినతులు ఇస్తూనే ఉన్నాను. ఎన్నిసార్లు ఇక్కడికి వచ్చి కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా ఫలితం మాత్రం దక్కడం లేదు. రెండు కాళ్లు లేవు నడవలేని స్థితిలో దేకుకుంటూ కలెక్టర్ కార్యాలయం వరకు రావాల్సి వస్తోంది.. ఈ స్థితిలో ఇలా కొన్నేళ్లుగా తిరుగుతున్నా అధికారుల నుంచి స్పందన రాకపోవడం, ప్రభుత్వం నుంచి సహకారం లేకపోవడం దారుణం' అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు పార్థసారథి.

ఇక ఎవరికి చెప్పుకోవాలో..



'నాపేరు జగన్నాథ అరుణ్‌బాబు. మాఊరు కలికిరి నూర్ కాలనీ. నాకు రెండు కాళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. మాతల్లి చనిపోయింది. నేను పింఛన్ కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నాను. మాలాంటి వికలాంగులకు న్యాయం జరగాలంటే ఎవరితో చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. ప్రజావేదికలో అర్జీ ఇచ్చేందుకు వచ్చాను. సార్.. సార్.. నాకు పింఛన్ ఇప్పించండి' అని అక్కడికి వచ్చిన అధికారులను అరుణ్ బాబు ప్రాధేయపడుతున్నా.. ఫలితం దక్కడం లేదు.

పెన్షన్ ఇవ్వండి మహాప్రభో..



నాపేరు వీభద్రాచారి. మా ఊరు పీలేరు బాలమారుపల్లె. నా వయసు 65 సంవత్సరాలు. నాకు కళ్లు సరిగా కనపడవు. ఆసుపత్రికి వెళ్లి ఒక కన్నుకు వైద్యం చేయించుకున్నాను. నాకు ఏ ఆధారము లేదు. సంబంధిత పత్రాల కోసం అధికారుల చుట్టూ తిరగాను. సార్.. ఇప్పటికైనా నాకు పింఛన్ మంజూరు చేయాలి.

మానవత్వంతోనైనా న్యాయం చేస్తారని..



నా పేరు టి.నందిని, మేము మండల కేంద్రమైన గాలివీడు టౌన్ చిలకలూరిపేటలో నివసిస్తున్నాం. 2024 నవంబర్ ఆరో తేదీన నా భర్త హరినాథ్ పక్కిరవాండ్లపల్లి సమీపంలో మామిడి తోటలో ట్రాక్టర్ మిల్లరులో పడి మృతి చెందాడు. దీనికి కారణమైన వారు అరవిటి వాండ్లపల్లిలో ఉన్నారు. దాదాపు 5 నెలలు కావస్తున్నా నాకు ఎటువంటి న్యాయం జరగలేదు. నేను నా పిల్లలు కలిసి చనిపోవడానికి సిద్ధమవుతున్నాము. మా కుమార్తె సాహితీకి నాలుగేళ్లు, కుమారుడు జన్నేశ్వర్‌కు ఏడాది.. నా పరిస్థితి బాగా లేకనే ఇంత దూరం ఇద్దరి పిల్లల్ని వేసుకొని అధికారుల దగ్గరికి వచ్చా.. కనీసం మానవత్వంతో అన్న న్యాయం చేస్తారని కలెక్టర్‌కు సార్ విన్నవించుకోగా .. ఆయన గాలివీడు పోలీసులకు ఫోన్ చేసి అవతలి వ్యక్తి మీద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని చెప్పారు.. నేను ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాను. న్యాయం కోసమే ఇక్కడికి వచ్చాను.

భూమి ఆన్‌లైన్ చేయరూ..



పుల్లంపేట మండలం గొల్లపల్లె రంగంపల్లె. నాపేరు బూసిరెడ్డి ఆదిలక్షుమ్మ. నాకొడుకు రెడ్డయ్యరెడ్డికి నాకు సంబంధించిన ఎకరాన్నర భూమిని రాయిచ్చాను. అయితే 172/3లో 26 సెంట్లు ఆన్‌లైన్‌లోకి ఎక్కలేదు. మ్యుటేషన్ చేయిస్తామనుకుంటే కంప్యూటర్ తీసుకోవడం లేదని సారోళ్లు చెబుతున్నారు. ఆరేడు నెలల నుంచి సచివాలయానికి, తహసీల్దార్ ఆఫీసు చుట్టూ తిరిగుతున్నా. నాపని మాత్రం కావడం లేదు. ఈ వయస్సులో ఎండలకు ఆఫీసుల చుట్టూ తిరగాలంటే అయ్యేపనేనా అయ్యా. ఏమైనా సమస్య ఉంటే ఇదోమ్మా ఈ సమస్య ఉంది అందువల్ల నీపని కాదు అని చెప్పొచ్చు కదా. ఎకరాన్నర భూమిలో 26 సెంట్లు మాత్రమే ఎందుకు ఆన్‌లైన్ చెయ్యరు.

ముసలోడినని కూడా కనికరం చూపడం లేదు



నాపేరు మన్నూరు సుబ్బారెడ్డి. రాజంపేట మండలం సీతారాంపురం నడింపల్లెలో నాకు ఎకరా ఎనభై సెంట్లు భూమి ఉంది. ఆ భూమిని మానాయన సింగారెడ్డి 1976లో మలరాజు పిచ్చయ్య, ఆముదాల వెంకటయ్యకాడ కొనుకున్నాడు. ఇప్పుడు ఆ భూమి నాపేరు మీద ఉంది. ఎకరా ఎనభైసెంట్ల భూమిలో 33 సెంట్లు మాత్రం ఆన్‌లైన్ చేయలేదు. ఆన్‌లైన్ చేయాలని నేను తాసీల్దారు ఆఫీసు చుట్టూ తిరిగినా. నాకుబొత్తిగా సదువు రానందున నన్ను ఎవరు కూడా పట్టించుకోకుండా నాపని చేయడం లేదు.

నా పేరుతో ఇల్లు.. బిల్లులు ఎవరికో ఇచ్చి..



నా పేరు జి.రామక్క. నా పేరుతో గత ప్రభుత్వం ఇల్లు నిర్మించుకునేందుకు మంజూరు చేసింది. అయితే స్థోమత లేక అప్పట్లో ఇల్లు కట్టుకోలేదు. ఇప్పుడు ఇల్లు కట్టుకొందామని అధికారుల దగ్గరకు వెళ్లి అడిగితే.. ఎప్పుడో ఇల్లు కట్టుకున్నానని దానికి బిల్లులు కూడా తీసుకున్నావని చెప్పుతున్నారు. నా బ్యాంక్ పాస్ బుక్, రికార్డులు తీసుకెళ్లి చూస్తే బిల్లులు పడినట్లు లేదు. మళ్లీ అడిగితే మళ్లీ అదే సమాధానం, ఎవరికి వేశారో రికార్డులు చూపాలని కోరితే నా పేరు జి.రామక్క అయితే.. సీ రామక్క అనే పేరుతో బిల్లులు వేసినట్లు రికార్డులు చూపెట్టారు. అయితే ఆమె ఎక్కడుందో చెప్పితే ఆమె దగ్గరకు వెళ్లి అడుగుతానని కోరితే.. ఎక్కడుందో వారికి తెలియదంటా. అది నేనే తెలుసుకొని వారి దగ్గరికి తీసుకెళ్లాలంట. ఆమె ఎవరో ఏ జిల్లాలో ఉందో నాకెలా తెలుస్తుంది. బిల్లులు ఇచ్చిన అధికారులకు వారి ఇచ్చిన పేపర్ల ఆధారంగా చూడొచ్చు కదా.. డబ్బులు వాళ్ల ఇచ్చి.. ఆమె ఎవరో నేను తెలుసుకొని తీసుకురమ్మంటున్నారు.



టైం అవుతోంది.. పరుగు పెట్టక తప్పదు..

తొలి రోజు ప్రశాంతం

- ప్రారంభమైన పది పరీక్షలు
- 97.62 శాతం విద్యార్థుల హాజరు

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో పదో తరగతి పరీక్షలు మొదటి రోజున ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన పరీక్షలు మధ్యాహ్నం 12.30 వరకు జరిగాయి. జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు. జిల్లాలో జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 22, 296 మందికి గాను 21,711 మంది హాజరు కాగా.. 530 మంది గైర్హాజరైనట్లు డీఈఓ సుబ్రమణ్యం తెలిపారు. పరీక్షలకు 97.62 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు.

తెలుగుకు బదులుగా హిందీ పేపర్

పదోతరగతి పరీక్షలలో ముగ్గురు విద్యార్థులకు హాల్ టికెట్లు ముద్రణలో తెలుగు సబ్జెక్టుకు బదులు హిందీ సబ్జెక్టు ముద్రణ కావడంతో.. జిల్లాలోని మూడు సెంటర్లలో కొద్దిసేపు హైరానా నెలకొంది. హిందీ ప్రశ్నాపత్రాన్ని అందుకున్న ఆ విద్యార్థులు తొలుత ఆందోళనకు గురయ్యారు. విద్యార్థుల ఆవేదన, హాల్ టికెట్టు పరిస్థితులను స్థానిక పరీక్ష నిర్వహణ అధికారి జిల్లా విద్యాశాఖ అధికారికి సమాచారం అందించారు. ముద్రణలో పొరపాటు జరిగి ఉంటుందని, వెంటనే వారికి తెలుగు ప్రశ్నాపత్రాన్ని ఇచ్చి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని ఆదేశించడంతో.. కొన్ని నిమిషాల వ్యవధిలో సమస్యకు పరిష్కారం లభించింది. ఈ పరిస్థితి జిల్లాలోని మూడు ప్రాంతాలలో నెలకొనడంతో సమస్యకు పరిష్కారం చూపామని డీఈఓ తెలిపారు.

కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు

పదో తరగతి పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టంగా భద్రాతా ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు పోలీసులు పగడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. రాయచోటి టౌన్ నేతాజీ సర్కిల్ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి.. డీఈఓ డాక్టర్ కె. సుబ్రమణ్యంతో కలిసి సందర్శించారు. అనంతరం మాసాపేట జిల్లా పరిషత్ హైస్కూల్, లక్కిరెడ్డిపల్లి మోడల్ స్కూల్‌లో జరుగుతున్న పదో తరగతి పరీక్షా కేంద్రాలను సందర్శించారు. కేంద్రాల చుట్టూ ఉన్న పరిసరాలు, పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు.



రాజంపేటలో పరీక్ష రాసేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు

దేవుడా.. ఇదేం 'పరీక్ష'

బి.కొత్తకోట : బి.కొత్తకోటలో పదవ తరగతి విద్యార్థి తీవ్రంగా గాయపడి కాలు కదపలేని స్థితిలో మంచంపై పరీక్షా కేంద్రానికి హాజరైన ఉదంతం ఇది. సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రారంభమై మొదటి రోజు తెలుగు పరీక్ష నిర్వహించారు. మండలంలోని ఆకులవారిపల్లెకు చెందిన లహిత్‌కుమార్‌రెడ్డి గట్టు జెడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి పూర్తి చేయగా స్థానిక మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో పరీక్షలకు హాజరుకావాల్సి వుంది. ఆయితే విద్యార్థి లహిత్‌కుమార్‌రెడ్డి శనివారం బైక్‌పై ఆకులవారిపల్లె నుంచి గట్టుకు వస్తుండగా హైస్కూల్ వద్ద ప్రమాదానికి గురయ్యాడు. కుడి కాలుకు తీవ్ర గాయాలు కావడంతో కాలంతా కట్టు కట్టారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి పరీక్షలు రాయాల్సి ఉండటంతో కుటుంబ సభ్యులు కారులో స్కూల్‌కు తీసుకొచ్చారు. అక్కడి నుంచి పరీక్షా కేంద్రంలోకి మోసుకెళ్లే పరిస్థితి లేకపోవడంతో మంచంపై తీసుకెళ్లారు. విద్యార్థి పరిస్థితి గమనించిన నిర్వాహకులు ఉపాధ్యాయుల విశ్రాంతి గదిలో పరీక్ష రాసేందుకు అవకాశం కల్పించారు. ఆయితే రాసేందుకు వీలుకావడం లేదని చెప్పడంతో ఓ తొమ్మిదో తరగతి విద్యార్థిని సహాయంగా నియమించడంతో లహిత్‌కుమార్‌రెడ్డి పరీక్ష పూర్తి చేశాడు.



లహిత్‌కుమార్‌రెడ్డిని మంచంపై పరీక్షా కేంద్రానికి తీసుకొస్తున్న కుటుంబీకులు

న్యూస్‌రీల్

25న రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికలు

రాజంపేట : రాజంపేట బార్ అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించనున్నారు. సోమవారం నామినేషన్ల ప్రక్రియ సీఈఓ పి.సురేష్‌కుమార్ నేతృత్వంలో ప్రారంభమైంది. బార్ అసోసియేషన్ అధ్యక్ష స్థానానికి హనుమంతు నాయుడు నామినేషన్‌ను దాఖలు చేశారు. మంగళవారం కూడా నామినేషన్‌ల ప్రక్రియ జరుగుతుంది. 19న నామినేషన్‌ల స్క్రూటినీ, 20న నామినేషన్ల ఉపసంహరణ, 21న పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా, 25న పోలింగ్, అదే రోజున కౌంటింగ్ నిర్వహించనున్నారు.

వైవీయూ ఉపకులపతిగా అల్లం శ్రీనివాసరావు



కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆచార్య అల్లం శ్రీనివాసరావు నియమితులయ్యారు. నెల్లూరు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పనిచేస్తున్న ఆయనను వైవీయూ ఇన్‌చార్జి వీసీగా నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఆర్డర్ ద్వారా ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇది వరకు వైవీయూ ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య ఫణితి ప్రకాష్‌బాబు పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా నియమితులు కావడంతో ఆయనను రిలీవ్ చేశారు. ఆ స్థానంలో నూతన ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్‌గా ఆచార్య అల్లం శ్రీనివాసరావును నియమించారు. ఒకటి రెండు రోజుల్లో ఆయన వీసీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

చేదెక్కిన చెరకు

- జిల్లాలో తగ్గిన పంట విస్తీర్ణం
- మూతపడిన చక్కెర పరిశ్రమలు
- ప్రభుత్వ ప్రోత్సాహం కరువు
- ఆవేదనలో రైతు



చెరకు సాగు చేసిన రైతుల బతుకు చేదెక్కుతోంది. షుగర్ ఫ్యాక్టరీల మూసివేతతో దిగుబడిని విక్రయించుకోవడానికి వారు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. మద్దతు ధర ప్రకటనలో ప్రభుత్వ ప్రోత్సాహం కరువు అవుతోంది. దీంతో చాలా మంది ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించారు. పర్యవసానంగా జిల్లాలో చెరకు సాగు గణనీయంగా తగ్గిపోయింది.

తంబళ్లపల్లె : జిల్లాలో చెరకు సాగు క్రమేపీ తగ్గుముఖం పడుతోంది. ఏడాదికేడాది విస్తీర్ణం తగ్గిపోతోంది. నాడు వేల ఎకరాల్లో సాగు చేసేవారు. నేడు అరకొర సాగుకే పరిమితమైంది. అన్నమయ్య జిల్లాలో తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లో మాత్రమే కేవలం 35 ఎకరాలకే సాగు పరిమితమైనట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. చెరకును ప్రధానంగా చక్కెర తయారీకి వినియోగిస్తారు. పక్క జిల్లాలో ఉన్న షుగర్ ఫ్యాక్టరీ మూతపడటంతో కష్టాలు మొదలయ్యాయి. మార్కెట్ సౌకర్యాలు సరిగా లేవు. మద్దతు ధర ప్రకటించడంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. చెరకు పంటకు మార్కెట్ సౌకర్యం కల్పించి, గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

నల్లబెల్లం అమ్మకాలపై ఆంక్షలతో ఇక్కట్లు

ఉన్న కష్టాలు చాలవన్నట్లు.. నల్లబెల్లం తయారీ, అమ్మకాలపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. నాటు సారా తయారీలో బెల్లం కీలకం. ఎస్ఈబీ, పోలీస్, ఎక్సైజ్ అధికారులు.. సారా తయారీదారులు దొరికినప్పుడు బెల్లం కొనుగోలు చేసిన దుకాణదారుడి వివరాలు సేకరిస్తున్నారు. అంతటితో ఆగకుండా.. బెల్లం తయారీకి వినియోగించే చెరకు విక్రయాలపై కూడా వారు ఉక్కుపాదం మోపారు. చెరకు కొనుగోలు చేసి తీసుకెళ్లే వారిపైన కేసులు పెడుతున్నారు.

స్వల్పకాలిక పంటలపై ఆసక్తి

గతంలో పడమటి మండలాల్లో వర్షాధార పంటలుగా వేరుశనగ, చెరకు సాగు చేసే వారు. నేడు వాణిజ్య పంటలుగా టమాటా, కర్బూజ, దోస, గుమ్మడిలను సాగు చేస్తున్నారు. ఇవి స్వల్ప కాలంలో చేతికి అందుతుండటంతో.. వీటి వైపు మొగ్గు చూపారు. చెరకు సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. చెరకు దీర్ఘకాలిక పంట. పెట్టుబడికి నష్టం లేకుండా.. పంట చేతికి అందుతుంది. తంబళ్లపల్లె మండలంలోని కొత్త కురవపల్లెకు చెందిన రైతు రెడ్డిబాషా నేటికీ చెరకు సాగు వదలకుండా చేస్తున్నాడు. ఒక ఎకరా సాగు చేసేందుకు దున్నకం, ఎరువులు, కూలీల ఖర్చు సుమారు రూ.లక్ష వస్తుందని ఆయన తెలిపారు. బెల్లం వండేందుకు రూ.60 వేల ఖర్చు వస్తుంది. ఈ పంటకు చీడపీడల బెడద ఉండదు. ఎకరాకు 60 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్ ధర క్వింటా రూ.6 వేలు పలుకుతున్నా.. బహిరంగంగా అమ్ముకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



తంబళ్లపల్లె మండలంలో ఏపుగా పెరిగిన చెరకు పంట


అమ్ముకునే వెసులుబాటు కల్పించాలి



ఆరుగాలం కష్టపడి పండించిన చెరుకును అమ్ముకునేందుకు రైతులు అష్ట కష్టాలు పడాల్సి వస్తోంది. చెరుకు విక్రయాలపై ఎక్సైజ్ అధికారుల తీరు మారాలి. ప్రభుత్వం నల్లబెల్లం తయారీని అమ్ముకునే వెసులుబాటు కల్పించాలి. చెరకు పంటకు మార్కెట్ సౌకర్యం కల్పించి, గిట్టుబాటు ధర కల్పించాలి. అప్పుడే రైతులు చెరుకు సాగు చేయగలరు.

– రెడ్డిబాషా, రైతు, కొత్త కురవపల్లె, తంబళ్లపల్లె మండలం

పలు సమస్యలతోనే అనాసక్తి



ఒకప్పుడు.. చెరుకు పంట దీర్ఘకాలికమైనా నికరమైన ఆదాయం వచ్చేది. ఇప్పుడు పలు సమస్యలు తలెత్తడంతో రైతులు చెరకు సాగుపై ఆసక్తి చూపడం లేదు. పక్క జిల్లాలో ఉన్న షుగర్ ఫ్యాక్టరీ మూతపడటం, మార్కెట్ సౌకర్యాలు లేకపోవడం, బెల్లం తయారీ సమయంలో కూలీల సమస్యతో రైతులు చెరుకు సాగును చేయలేకపోతున్నారు.

– రమణకుమార్, వ్యవసాయ అధికారి, తంబళ్లపల్లె

వేసవి వస్తే డిమాండ్

వేసవి కాలంలో ఎండలు మండిపోతున్నాయి. దీంతో ప్రజలు ఉష్ణతాపాన్ని తగ్గించే రసాలపై మొగ్గు చూపుతున్నారు. వీటిలో చెరకు రసం ప్రధానమైనది. కావున మార్చి, ఏప్రిల్, మే నెలల్లో చెరకులకు డిమాండ్ ఉంటోంది. ఈ మూడు నెలలు మాత్రమే మార్కెటింగ్ సౌకర్యం బాగుండటం.. మిగతా కాలల్లో లేకపోవడంతో.. చెరకు సాగు తగ్గిపోతోంది.



చెరకు రసం తీస్తున్న మహిళా రైతు

ఎక్సైజ్ అధికారుల తీరుపై విమర్శలు

ఎలుకలు ఉన్నాయని ఇంటినే తగలేసిన చందంగా తయారైంది.. ఎక్సైజ్ అధికారుల తీరు. సారా తయారీకే బెల్లం వినియోగిస్తున్నారని భావిస్తే.. కచ్చితంగా అలాంటి వ్యాపారులపై చర్యలకు ఉపక్రమించాలి. కానీ పిండి వంటలు, ఇతర గృహ అవసరాలకు ఉపయోగపడే బెల్లాన్ని పూర్తిగా వద్దనడంపై విమర్శలు వస్తున్నాయి. మద్యపానం ఆరోగ్యానికి హానికరం అంటూ ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేస్తోంది. అయినా గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా కొనసాగుతూనే ఉన్నాయి. మరో వైపు ప్రభుత్వమే అధికారికంగా మద్యం అమ్మకాలు నిర్వహిస్తోంది. ఆరోగ్యానికి మేలు కలిగించే బెల్లం అమ్మకాలపై మాత్రం నిషేధం విధించింది. ఒకప్పుడు బెల్లం తయారీకి నియోజకవర్గం ప్రసిద్ధి. ఇక్కడ పండించే బెల్లం ముంబయి, చెన్నై, గుజరాత్ రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో అనంతపురం, వైఎస్సార్ జిల్లా, శ్రీ సత్యసాయి జిల్లాల నుంచి వ్యాపారులు పల్లెల్లో ముమ్మరంగా తిరిగి కొనుగోలు చేసి తీసుకెళ్లే వారు.



బెల్లం ముద్దలు (ఫైల్)

భద్రకాళీ సమేతుడికి పల్లకీ సేవ



పల్లకీలో ఊరేగుతున్న భద్రకాళీ సమేత వీరభద్రుడు

రాయచోటి టౌన్ : రాయచోటిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి పల్లకీ సేవ అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం రాత్రి స్వామి వారికి, అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించి అందంగా అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ మాఢవీధులలో, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఈ పల్లకీ సేవ ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణయ్య స్వామి, శంకరయ్య స్వామి, శేఖరయ్య స్వామి, వేద పండితులు రాచరాయ యోగీ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. అంకిశెట్టిపల్లె పంచాయతీ నారమాకుల తండాకు చెందిన చినరెడ్డెప్ప నాయక్ కుమారుడు దొరస్వామి నాయక్(38) కుటుంబ సమస్యలతో ఇంటివద్దే విషపు గుళికలు మింగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అత్యవసర విభాగంలో చికిత్స అందిస్తున్నారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

భక్తి పారవశ్యం.. ప్రేమ వాత్సల్యం

- దివ్య సుగంధాలను వెదజల్లుతున్న రంజాన్
- ఉపవాసదీక్షాపరులతో మసీదులు కళకళ
- ఎటుచూసినా ఆధ్యాత్మిక వాతావరణం



జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఇఫ్తార్‌కు అవసరమైన ఖర్జూరాలు కొనుగోలు చేస్తున్న ముస్లింలు

మదనపల్లె సిటీ : మానవుల ఆలోచనాత్మక శిక్షణ.. ఆచరణాత్మక సంస్కరణ.. ఆధ్యాత్మిక వికాసం.. ఆత్మీయత, అనురాగాల అనుబంధం.. ఆకలి నుంచి ఔన్నత్యానికి దైవం అందించిన మహత్తర అవకాశం రంజాన్ మాసం. పవిత్ర వాతావరణంలో శారీరక, మానసిక, సాధనతో నైతిక ప్రగతి సుసాధ్యం అని ఇస్లాం బోధిస్తుంది. భక్తి పారవశ్యానికి ప్రతీక అయిన ఈ మాసం ప్రేమ.. వాత్సల్యాన్ని పంచుతోంది. విధిగా దానం(జకాత్) ద్వారా పేదలను అక్కున చేర్చుకునే శుభాల వసంతం రంజాన్ మాసం.

జిల్లాలో రంజాన్ మాసం సందర్భంగా శారీరక, ఆధ్యాత్మిక వికాసానికి సాధనమైన ఉపవాసాలు కొనసాగుతున్నాయి. మసీదుల్లో రంజాన్ సూచికగా తరావీల రూపంలో దివ్యఖురాన్ ఆయత్‌లు ప్రతి చోట వినిపిస్తున్నాయి. రంజాన్ నెల వంక దర్శనమైనప్పటి నుంచి మసీదు కమిటీల ఆధ్వర్యంలో ఇఫ్తార్, సహర్ వేళలను పాటిస్తూ ఉపవాసాలు చేస్తున్నారు. సహనం, క్రమశిక్షణ లాంటి మహోన్నత వ్యక్తిత్వాలను అలవర్చే రోజా వ్రతాలను ఉపవాసదీక్షాపరులు భక్తిశ్రద్ధలతో పాటిస్తున్నారు.

ఆధ్యాత్మిక వికాసానికి స్వాగత ద్వారం..

రంజాన్ నెల ఆధ్యాత్మిక స్వాగత ద్వారం లాంటిదని ముస్లింల భావన. అన్ని దుష్టకార్యాల నుంచి రక్షణ పొందేందుకే రంజాన్ శిక్షణగా భావిస్తారు. నెల రోజులు పాటించే ఆచరణలు మిగిలిన జీవితంలో కూడా చేపట్టాలన్నదే రంజాన్ శిక్షణ ధ్యేయం. ఉపవాసాలు పాటించే ముస్లింలు ఈర్ష్య, ద్వేషం, అసత్యం పలకడం తదితర దుర్గుణాలను త్యజిస్తారు. ఉపవాసదీక్షాపరుల్లో పవిత్రత నెలకొంటుంది. రాగద్వేషాలకు తావులేని వాతావరణం వెల్లివిరిస్తుంది. ఎలాంటి చెడులు లేని ప్రశాంత జీవితం దక్కుతుంది. ఉపవాసదీక్ష పాటించిన ప్రతి ముస్లింని రోజా పరిణితి కలిగిన వ్యక్తిగా తీర్చిదిద్దుతుంది.

ఆత్మీయత, అనురాగాలు..

రంజాన్ నెలంతా ప్రతి ముస్లిం ఇంట్లో దైవారాధనలు, పవిత్ర ఉపవాసదీక్షలు, పుణ్యకార్యాలు, ఆధ్యాత్మిక చింతన వెల్లివిరుస్తుంది. ఉపవాసం పాటించేవారు తెల్లవారకముందే లేచి భోజనం ఆరగించాలి. దీన్ని సహరి అంటారు. సూర్యాస్తమయం వరకు మంచినీళ్లు సైతం ముట్టరు. అనంతరం మసీదు సైరన్‌తో ఉపవాసం ముగిస్తారు. దీన్ని ఇఫ్తార్ అంటారు. మసీదులన్నీ నమాజులతో కిటకిటలాడుతున్నాయి. పవిత్ర ఖురాన్ పఠనంతో తన్మయులవుతారు.

దయాగుణం అలవడుతుంది..

రంజాన్‌మాసం కొందరు ముస్లింలలో ఉన్న పిసినారితనం, ధనార్జన గుణం తదితర దుర్గుణాలను పోగొట్టి, దానగుణాన్ని పెంపొందిస్తుంది. ఈ నెలలో దానధర్మాలు అధికంగా చేయాలని మహమ్మద్ ప్రవక్త బోధించారు. ఒక్కొక్క పుణ్యకార్యానికి 70 రెట్లు అధిక పుణ్యఫలం ప్రసాదిస్తాడని ప్రవక్త బోధించారు. దీంతో ఆర్థికంగా సహాయం అందుతుంది. తమ సంపాదనలో 2.5 శాతం ధనాన్ని పేదలకు పంచాలని అల్లాహ్ ఖురాన్‌లో శాసనం చేశారు. సదఖా, జకాత్, ఫిత్రా దానాల ద్వారా పేదలకు రంజాన్ నెలలో ఆనందోత్సవాలతో పండుగ జరుపుకుంటారు. దీంతో వారి అవసరాలు తీరుతాయి. ఫలితంగా సమసమాజ స్థాపన జరుగుతుంది. ఆర్థిక సమస్యలకు పరిష్కారంగా జకాత్ ఉపయోగపడుతుంది. రంజాన్ నెలంతా ఇలా భయ, భక్తులతో ఉపవాసాలను పాటిస్తూ నమాజులను ఆచరిస్తూ ధాన, ధర్మాలను చేస్తూ అత్యంత భక్తిశ్రద్ధలతో ముస్లింలు గడుపుతారు. తరావీ నమాజులో ఇమామ్‌ల ద్వారా ఖురాన్‌లో కొంత భాగాన్ని రోజూ ఆలకిస్తారు. ఇలా చేయడం పుణ్యప్రదంగా భావిస్తారు. త్రికరణ శుద్ధిగా ఖురాన్ బోధనలను పఠిస్తారు.

మృదు స్వభావం..

సమాజంలో పేదసాదల ఆకలిదప్పులను రోజా(ఉపవాసదీక్షలు)లు తెలుపుతాయి. తోటివారి వ్యథాభరిత జీవితాన్ని కళ్లకు కడుతుంది. దీంతో తమ తోటివారు అనాథలు, అణగారిన వారిపై జాలి కలుగుతుంది. తద్వారా మృదుస్వభావం అలవడుతుంది. దీంతో వారి బాధలను కష్టాలని తీర్చేందుకు పాటుపడతారు.

వ్యసనాలకు దూరంగా..

తాగుడు, జూదం, మత్తు పదార్థాలను నమలడం లాంటి దురలవాట్లు 16 గంటల పాటు దూరమైతే ఆ వ్యక్తిలో ఆయా వ్యసనాలను త్యజించే మానసిక సంసిద్ధత ఉద్భవిస్తుందని నమ్మకం. ఉపవాసాలు మనిషి అన్ని చెడులను దూరంగా చేసి, సత్కార్యాలను దగ్గర చేస్తాయి. అత్యుత్తమ శిక్షణనిస్తాయి.

ప్రవక్త బోధనలు పాటించాలి..



రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఉపవాసదీక్షలతో పాటు మహమ్మద్ ప్రవక్త బోధనలు పాటించాలి. రంజాన్ మాసంలో 30 రోజుల పాటు చేపట్టే ఉపవాసదీక్షలతో పేదల ఆకలి, బాధ తెలుస్తుంది. దీంతో పేదలను ఆదుకోవడం జరుగుతుంది. రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం ఏదో విధంగా పేదలను ఆదుకోవాలి. పేదరికం లేని సమాజ నిర్మాణమే రంజాన్ ఆశయం.

-మౌలానా జలాలుద్దీన్‌సాహెబ్, ప్రభుత్వఖాజీ, మదనపల్లె

ముగ్గురిపై బైండోవర్ కేసు

ఓబులవారిపల్లె : నాటుసారా తయారీకి సంబంధించి పాత కేసులో వై.కోట గ్రామానికి చెందిన ముగ్గురిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ వరుణ్ కుమార్ తెలిపారు. ఎం.పెంచలయ్య, టి.చలపతి, వెంకట సుబ్బయ్యలను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు.

ఆర్టీపీపీ కాలుష్యంపై రైతుల ఫిర్యాదు

ముద్దనూరు : మండలంలోని కొసినేపల్లె గ్రామంలోని సుమారు 30 మంది రైతులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం కడప కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ సెల్‌కు హాజరైన రైతులు ఆర్టీపీపీలోని చిమ్నీలనుంచి వెలువడే బూడిద కాలుష్యం అధికంగా ఉందన్నారు. దీంతో పరిశ్రమకు పక్కనే ఉన్న తమ గ్రామంలోని పంటలు నాశనమవుతున్నాయని వాపోయారు. గతంలో పలుమార్లు ఆర్టీపీపీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఈ కాలుష్యాన్ని అరికట్టి తమను కాపాడాలని వారు కోరారు.

బుగ్గవంకలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కడప అర్బన్ : కడప నగరం తారకరామా నగర్ సమీపంలోని బుగ్గ వంక కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న తాలూకా ఎస్ఐ తాహిర్ హుస్సేన్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఎస్ఐ వివరాల మేరకు.. మృతి చెందిన వ్యక్తి వయస్సు 55 నుంచి 60 సంవత్సరాలు ఉంటుందన్నారు. రోజుల క్రితమే మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు.



ప్రకృతి పంటలకు మంచి డిమాండ్



కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

రాయచోటి టౌన్ : ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలకు మంచి డిమాండ్ ఉందని మార్కెటింగ్ ఎస్ఎఫ్ పవన్ కుమార్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయం ఆవరణంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలను విక్రయించేందుకు ఒక స్టాల్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి సోమవారం ఈ స్టాల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గణనీయంగా కొనుగోళ్లు జరిగి రైతులు పండించిన పంటలకు డిమాండ్ పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఎంపీ పద్మావతి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్య సేవ ఉద్యోగుల నిరసన



డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఎన్టీఆర్ వైద్య సేవ ఉద్యోగులు

రాయచోటి టౌన్ : తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఎన్టీఆర్ వైద్య సేవ ఉద్యోగులు సోమవారం జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, క్యాడర్ కల్పించాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆ శాఖ అధికారులకు అందజేశారు.

అడవి పందిని ఢీకొని వ్యక్తికి గాయాలు



అడవి పందిని ఢీ కొని గాయపడిన పవన్

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో అడవి పందిని ఢీ కొని బైకుపై నుంచి కింద పడటంతో డీకాల పవన్ అనే వ్యక్తి తలకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామంలో అడవి పందులు అధికంగా సంచరిస్తున్నాయి. చీకటి పడగానే అడవి పందులు మందలుగా వీధుల్లోకి వస్తున్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు భయాందోళనకు గురవుతున్నారు. ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి అడవి పందుల బెడదను నివారించాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

గండి దేవస్థాన భూములకు వేలం పాట



గండి దేవస్థానం వేలం పాటలో మాట్లాడుతున్న ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య

చక్రాయపేట : మండలంలోని మారెళ్ల మడక గ్రామ పంచాయతీలో ఉన్న గండి వీరాంజనేయస్వామి ఆలయంలో సోమవారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో గండి దేవస్థాన భూములకు వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో ఇడుపులపాయ గ్రామ సర్వే నెంబర్ 469లో గల 8.72 ఎకరాల భూమిని ఏడాది కాలానికి రూ.1.51 లక్షలకు పి.జి.మహేష్ దక్కించుకున్నారు. అలాగే వీరన్నగట్టుపల్లె గ్రామంలోని 98 సెంట్ల భూమిని రూ.4 వేలకు ఆర్.తేజేశ్వర దక్కించుకున్నారు. అలాగే గండి దేవస్థానానికి సంబంధించిన సులభ్ కాంప్లెక్స్‌ను రూ.20 వేలకు ఇడుపులపాయకు చెందిన పి.వెంకటరత్నం దక్కించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కృష్ణతేజ, మాజీ చైర్మన్ వెంకటస్వామి, దేవస్థాన ఉప ప్రధాన అర్చకుడు రాజా రమేష్, ఆలయ సిబ్బంది, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు



గాయపడిన జయచంద్ర, సువర్ణ

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలోని హార్సిలీ హిల్స్ క్రాస్ సమీపం రామాపురం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు. స్థానిక బీసీ కాలనీకి చెందిన జయచంద్ర (58), సువర్ణ (50) భార్యాభర్తలు. జయ చంద్ర చిత్తూరు ఆర్టీసీ డిపోలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. వీరు బైక్ పై మదనపల్లెకు వెళ్లి తిరిగి బి.కొత్తకోటకు వస్తున్నారు. హార్సిలీ హిల్స్ క్రాస్ దాటుకుని రామాపురం వద్దకు రాగానే పీటీఎం నుంచి మదనపల్లికి టమాటా లోడుతో వెళ్తున్న ఐచర్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో భార్యాభర్తలు ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. జయచంద్ర కాలికి పలుచోట్ల ఫ్రాక్చర్లు అయ్యాయి, సువర్ణకు తల, పలుచోట్ల గాయాలయ్యాయి. వీరిని మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం జయచంద్రను బెంగళూరుకు, సువర్ణను వేలూరుకు తీసుకెళ్లారు.

జ్యోతి క్షేత్రంలో ఆశ్రమాలు తిరిగి నిర్మించాలి

కడప సెవెన్‌రోడ్స్ : జ్యోతి క్షేత్రంలో ఇటీవల ప్రభుత్వం కూల్చివేసిన ఆశ్రమాలను తిరిగి నిర్మించాలని డిమాండ్ చేస్తూ అన్నమయ్య కళాక్షేత్రం, హిందూస్ ఫర్ ప్లూరలిటీ అండ్ ఈక్వాలిటీ సంయుక్తాధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర్‌స్వామి, హెచ్‌పీఈ జాతీయప్రధాన కార్యదర్శి కొవ్వూరు లోకనాథ్ మాట్లాడుతూ కాశిరెడ్డి నాయన జ్యోతి క్షేత్రం ఎంతో ప్రసిద్ధిగాంచిందన్నారు. ఆశ్రమ వసతి గృహాలను అటవీ అధికారులు కూల్చివేసిన సంఘటన లక్షలాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కూల్చివేతలు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జై భారత జాతీయ ఉపాధ్యక్షుడు వంశీ, గురవయ్య, పలువురు భజన కళాకారులు పాల్గొన్నారు. అనంతరం జేసీకి వినతి పత్రం అందజేశారు.

రేపు విజయవాడలో మహా ధర్నా

పులివెందుల టౌన్ : మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన విజయవాడలోని ధర్నా చౌక్‌లో మహా ధర్నా నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాంద్ బాషా తెలిపారు. సోమవారం పులివెందుల పట్టణంలో ఆయన మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథక కార్మికులకు నెలకు రూ.10వేలు వేతనం ఇవ్వాలని, ఎలాంటి కారణాలు లేకుండా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కామాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ఐచర్ వాహనం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల పరిధిలోని ప్రొద్దుటూరు రోడ్డులో ఎస్వీ కల్యాణ మండపం సమీపంలో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి గుడి దగ్గర ఆటోను గుర్తు తెలియని ఐచర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ చంగల రామాంజనేయులుతో పాటు ఆటోలో ఉన్న మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రొద్దుటూరు పట్టణంలోని డ్రైవర్ కొట్టాల కాలనీకి చెందిన అల్లం లక్ష్మీనారాయణమ్మ, అల్లం జగన్నాథం, అల్లం నాగ పద్మ, అల్లం నాగ బిందు, జి.నాగముని, జి. రామాంజనేయులు ప్రొద్దుటూరులోని ఒకే కుటుంబానికి చెందినవారు. వీరంతా ప్రొద్దుటూరు వెళ్లేందుకు చంగల రామాంజనేయులుకు చెందిన ఆటో ఎక్కారు. ఎస్వీ కల్యాణ మండపం వద్దకు రాగానే ఆటో వెనుక వైపు గుర్తు తెలియని ఐచర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ చంగల రామాంజనేయులు కాళ్లకు తీవ్ర గాయాలు కాగా, ఆటోలో ఉన్న మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

లింగాల సబ్ స్టేషన్‌లో అగ్నిప్రమాదం



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

లింగాల : మండల కేంద్రంలోని 133 కేవీ సబ్ స్టేషన్‌లో సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవించింది. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సబ్ స్టేషన్ సిబ్బంది ఫోన్ చేయడంతో అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సబ్ స్టేషన్ ఆవరణలో భారీగా ముళ్ల పొదలు ఉండటంతో ఫైర్ స్టేషన్ సిబ్బంది మంటల తీవ్రత ట్రాన్స్‌ఫార్మర్లకు తగలకుండా జాగ్రత్తలు చేపట్టారు. ఫైర్ సిబ్బంది అనిల్ కుమార్, రవీంద్రారెడ్డి, డ్రైవర్ ఆపరేటర్ బుజ్జిబాబు పాల్గొన్నారు. 133 కేవీ సబ్ స్టేషన్‌కు ఎలాంటి ప్రమాదం లేదని ఏఈ రమేష్ తెలిపారు. ముందు జాగ్రత్తగా విద్యుత్ సరఫరా నిలిపివేశామన్నారు.

కూటమి సర్కారు కట్టుకథ మదనపల్లె ఫైల్స్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి

మదనపల్లె : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మదనపల్లె సబ్ కలెక్టరేట్ అగ్ని ప్రమాద ఘటనను, రాజకీయ దురుద్దేశంతో కుట్ర పూరితంగా జరిగిందనే కోణంలో ప్రజలను నమ్మించేందుకు కూటమి సర్కార్ అల్లిన కట్టుకథే మదనపల్లె ఫైల్స్ అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. మదనపల్లె ఫైల్స్ ఘటనలో ప్రధాన నిందితుడుగా ఉన్న గౌతమ్‌తేజ్‌కు నిర్వహించిన పాలీగ్రాఫ్ పరీక్షలో నేర నిరూపణ నిర్ధారణ కాలేదని నివేదికలో వెల్లడించడంతో పాటు ఎవరి ప్రమేయం లేదని హైకోర్టు నిర్ధారించిందన్నారు. అగ్నిప్రమాద ఘటన రాత్రి 11.30 గంటలకు జరిగితే.. గౌతమ్ తేజ్ 10.40 గంటలకు సబ్ కలెక్టరేట్ నుంచి బయటకు వచ్చినట్లు స్పష్టంగా నివేదికలో పేర్కొన్నారని, సీసీ కెమెరా ఆధారాలు ఉన్నాయన్నారు. ఘటనలో ప్రభుత్వం పేర్కొన్న ఏ-1 ముద్దాయి గౌతమ్‌తేజకు ప్రమేయం లేదని తెలుస్తుంటే, ఎవరి ప్రోద్బలంతోనే జరిగిందని ఎంపీ మిథున్‌రెడ్డి కుటుంబ సభ్యులపై అభియోగాలు మోపడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఎల్లో మీడియాలో పెద్దిరెడ్డి కుటుంబంపై 20 నుంచి 30 అసత్య కథనాలు, అభియోగాలు మోపారని, వాటిలో ఏ ఒక్కటి రుజువు చేయలేకపోయారన్నారు. రెండురోజుల క్రితం పుంగనూరు నియోజకవర్గం కృష్ణాపురంలో వ్యక్తిగత విభేదాలతో దాయాదుల మధ్య గొడవ జరిగి హత్యకు దారితీస్తే.. వైఎస్సార్ సీపీకి ఆపాదిస్తూ నాయకులు మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఏమి జరిగినా వైఎస్సార్‌సీపీకి ఆపాదిస్తూ మాట్లాడటం కూటమి నాయకులకు అలవాటైపోయిందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, కొమ్మేపల్లె శ్రీనివాసులురెడ్డి, జన్నే రాజేంద్ర నాయుడు, నీరుగట్టి మేరీ, బి.రేవతి, ఈశ్వర్‌నాయక్, సురేంద్ర, మస్తాన్‌రెడ్డి, కోటూరి ఈశ్వర్, అంబేద్కర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


స్థలం కబ్జా చేసిన టీడీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలి



కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు, ఎమ్మార్పీఎస్ నాయకులు

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో ఏపీ ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ స్థలాన్ని కబ్జా చేసిన టీడీపీ నాయకుడు గంగిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దొడ్డి సురేష్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం తహసీల్దార్ నరేంద్రకుమార్‌కు ఫిర్యాదు చేశారు. 20 ఏళ్లుగా తమ ఆధీనంలో ఉండి కార్యక్రమాలు జరుపుకుంటున్న స్థలాన్ని కబ్జా చేయడం సమంజసం కాదన్నారు. అధికారులు తక్షణం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. తహసీల్దార్ ఆదేశాలతో వెంటనే రెవెన్యూ సిబ్బంది సంబంధిత స్థలాన్ని పరిశీలించారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఈ స్థలంలో ఎవరూ ప్రవేశించరాదని, ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గడికోట గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హాల్ టికెట్‌లో తప్పిదం.. అధికారుల హైరానా



తెలుగుకు బదులు హిందీ పరీక్ష అని ఉన్న హాల్ టికెట్

వీరబల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్ష హాల్ టికెట్‌లో తప్పుగా ముద్రించడంతో పరీక్ష కేంద్రంలో అధికారులు హైరానా పడ్డారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుతున్న నమ్రత హాల్ టికెట్‌లో తెలుగు పరీక్షకు బదులు హిందీ అని ముద్రించడంతో పరీక్ష కేంద్రంలో ఆ బాలికకు తెలుగు ప్రశ్నాపత్రం బదులు హిందీ ప్రశ్నా పత్రం ఇచ్చారు. ఇది గమనించిన విద్యార్థిని అవాక్కైంది. వెంటనే ఆమె ఇన్విజిలేటర్ దృష్టికి తీసుకెళ్లగా అధికారులు వెంటనే డీఈఓకు విషయాన్ని తెలిపారు. ఆయన స్పందించి హిందీ ప్రశ్నాపత్రం ప్రక్కన పెట్టి తెలుగు ప్రశ్నాపత్రం ఇవ్వాలని ఆదేశించారు. దీంతో ఆ విద్యార్థిని తెలుగు పరీక్ష రాసింది.

● బీమా లేని బతుకులు



వారు నిరాశ్రయులు.. కన్నవారిని.. కన్న ఊరును వదిలేసి వచ్చిన వలస జీవులు. పగలంతా ఏదో ఒక పని చేసుకుని.. రాత్రయ్యే సరికి ఇదిగో ఇలా పుట్‌పాత్‌లపై నిద్రిస్తుంటారు. అయిన వారికి.. ఆత్మీయులకు దూరంగా ఉంటున్న వీరి బతుకులకు ఎలాంటి ధీమా లేదు.. వీరు సేద తీరుతున్న చోట గోడపైన ఉన్న జీవిత బీమా ప్రకటన చూసిన వారు ఏ బీమా వర్తించని బతుకులు వీరివే కదా అంటూ ఓ క్షణం ఆగి.. ఆలోచించి వెళ్లిపోతున్నారు. కడప నగరంలో ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే మార్గంలో సాక్షి కంట పడిన దృశ్యమిది.

– ఎస్‌కే మొహమ్మద్ రఫీ, సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్, కడప.